


# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 20-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 199 పేజీలు: 4 వెల : రూ.7







# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 20-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 198 పేజీలు: 4 వెల : రూ.7


## ఓటమి.. విజయానికి..

# తొలిమెట్టు

- * కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- * క్రీడలతోనే మానసికోత్సాహం
- * ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి
- * ముగిసిన జిల్లా పోలీసు స్పోర్ట్స్ గేమ్స్ మీట్
- * విజేతలకు ట్రోఫీ, మెడల్స్, మెమెంటోలు ప్రదానం

**శ్రీకాకుళం, డిసెంబర్ 19 (వార్త):** క్రీడల్లో ఓటమి విజయానికి తొలిమెట్టు అని, క్రీడలతోనే మానసిక ఉల్లాసం, ఉత్సాహం కలుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో నిర్వహిస్తున్న పోలీసు స్పోర్ట్స్ గేమ్స్ మీట్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో విజేతలకు కలెక్టర్, ఎస్పీ బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఓవరాల్ ఛాంపియన్‌గా ఆర్మ్డ్ పోలీస్ రిజర్వ్ జట్టు నిలిచింది. అనంతరం పోలీసులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ పోలీసులు శారీరక, మానసికంగా దృఢంగా ఉండాలని, అప్పుడే శాంతిభద్రతలను పరిరక్షించగలుగుతారన్నారు. ప్రతిరోజు విధుల్లో చురుకుగా ఉండేందుకు క్రీడలు, వ్యాయామం దోహదపడుతుందని తెలిపారు. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరికి క్రీడలు, వ్యాయామం ఒక భాగంగా ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో భాగస్వామ్యం ముఖ్యమని, గెలుపు ఓటములు కాదన్నారు. అని క్రీడలు జరిగిన మూడు రోజులలో ఉద్యోగ ఒత్తిడి ఉన్నప్పటికీ క్రీడలో పాల్గొనడం సంతోషకరమని కొనియాడారు. ప్రతి రోజు కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన పోలీసు అధికారులకు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లకు మెమెంటోలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అదనపు ఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు వివేకానంద్, శేషాద్రి, సీఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, పిఈటీలు పాల్గొన్నారు.






## రాష్ట్ర పండుగగా..

# రథసప్తమి

- * జీవో విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం
- * ఫలించిన ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రయత్నం
- * సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే శంకర్ కృతజ్ఞతలు

**అరసవల్లి, డిసెంబర్ 19(వార్త):** ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణస్వామి రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో విడుదల చేసింది. ఈ మేరకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ విశాఖ ఎ కాలనీలోని తన కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతీ ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో సూర్యదేవుని పుట్టినరోజు సందర్భంగా రథసప్తమి వేడుకలు నిర్వహిస్తుంటామని తెలిపారు. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, తెలంగాణా ప్రాంతాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు ఆ రోజు స్వామి వారిని దర్శించుకుంటారని తెలిపారు. ఆ రోజు నిజరూప దర్శనంలో దర్శనమిచ్చే స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకుంటే తమ కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకమని చెప్పారు. 2025 ఫిబ్రవరి 4న రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ మూడు రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వం జీవో విడుదల చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనెం రామనారాయణరెడ్డికి, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే అరసవల్లి ఆలయ అభివృద్ధికి ప్రసాద్ పథకం ద్వారా రూ.100 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.




జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బండ్ల వ్యాపారస్తుల పొట్ట కొట్టొద్దు

**టెక్కలి, డిసెంబర్ 19(వార్త):** తమ పొట్ట కొటొద్దని బండ్ల వ్యాపారస్తులు ఆర్డీవోకి విన్నవించారు. గురువారం వారు ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని తమ నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ, పోలీస్ శాఖ కలిపి చిన్నబజార్‌లోని ఖాళీ స్థలంలో బండ్లతో సామాన్ల అమ్మకాలకు 50 మందికి మాత్రమే అనుమతి ఇచ్చారన్నారు. మిగిలిన వారు రోడ్ల మీద అమ్మకూడదంటే తామెలా బతకాలని వారు ఆర్డీవోకి విన్నవించారు. అందరికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా తొలగించడం అన్యాయం అని వారు ఆందోళన వ్యక్తం చేశారు.





## కొరికాన ఆధ్వర్యంలో నీటి సరఫరా

**ఎల్ ఎన్ పేట, డిసెంబర్ 19(వార్త):** గడేవానిపేట, బరటాం గ్రామస్థుల దాహార్తిని జనసేన నాయకులు కొరికాన భవాని, రవికుమార్ తీర్చారు. తాగునీటి సమస్య ఉందని ఎన్నో ఏళ్లుగా ఎంతో మంది ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని గ్రామస్థులు వాపోయారు. ఈ విషయాన్ని పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని, సుడా చైర్మన్ రవికుమార్ దృష్టికి ఇటీవల తీసుకెళ్లగా, వారు వెంటనే స్పందించి తాగునీరు అందించారన్నారు. కార్యక్రమంలో మండల జనసేనా పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం




**కొత్తూరు, డిసెంబర్ 19(వార్త):** పార్లమెంట్ సాక్షిగా భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కొత్తూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలతో బీజేపీ అసలు రంగు బయటపడిందన్నారు. బీజేపీ ఫాసిస్టు, నియంతృత విధానానికి ఇది నిదర్శనమన్నారు. తక్షణమే కేంద్ర మంత్రి పదవి నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, దళిత సంఘం నాయకులు బి.నగేష్, కె.మిన్నారావు, పి.కృష్ణ, టి.శివకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయానికి నూతన రహదారి



**కొత్తూరు, డిసెంబర్ 19 (వార్త):** కర్లెమ్మ గ్రామ పంచాయతీ పరిధిలో గల మహాసింగి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయానికి నూతన సీసీ రోడ్డు పనులను గురువారం మండల వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్, లోతుగెడ్డ ఇందిరరామ్, కర్లెమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు, కర్లెమ్మ మాజీ సర్పంచ్ పడాల వెంకటకృష్ణ, లోతుగెడ్డ కృష్ణ, ఎద్దు లక్ష్మణరావు, ఆదాడ తిరుపతిరావు, పెదకోట వైకుంఠరావు, ఎద్దు వెంకటరమణ మొదలగు రైతులు పాల్గొన్నారు.

## టీడీపీ సానుభూతిపరుడిపై వైకాపా శ్రేణుల దాడి

**పలాస, డిసెంబర్ 19(వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి మొగిలిపాడు గ్రామంలో టీడీపీ సానుభూతిపరుడు బర్ల శ్రీనుపై బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. ఇనప రాడ్లు, రాళ్లు, కర్రలతో తనపై దాడి చేశారని బాధితుడు శ్రీను పాత్రికేయులతో తెలిపారు. అనంతరం బాధితుడి తల్లి మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో వైకాపా కార్యకర్తలు దొంగతనాలు, దాడులకు పాల్పడుతూ భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. దాడి ఘటనకు సంబంధించి సీసీ ఫుటేజీ ఆధారంగా కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయండి

**-కేంద్ర గిరిజన శాఖా మంత్రికి ఎమ్మెల్యే ఎంజీఆర్ విన్నపం**


**-గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి**

**పాతపట్నం, డిసెంబర్ 19(వార్త):** మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏను ఏర్పాటుచేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరంను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. గురువారం ఆయన పార్లమెంట్‌లోని మంత్రి ఛాంబర్‌లో విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడుతో పాటు మర్యాదపూర్వకంగా కలిశారు. అత్యధిక గిరిజన జనాభా కలిగిన పాతపట్నం నియోజకవర్గంలో నేటికీ చాలా గ్రామాలకు తాగునీరు, రహదారి, విద్యుత్ సౌకర్యాలు లేవని, ఈమేరకు చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



# కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

**టెక్కలి, డిసెంబర్ 19(వార్త):** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్ వేదికగా కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడంపై దళిత ,రైతు, ప్రజా సంఘాల నాయకులు భగ్గుమన్నారు. గురువారం వారు టెక్కలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అమిత్‌షాపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. పార్లమెంటు వేదికగా అంబేడ్కర్‌ను అవమానపరిచిన అమిత్‌షాపై జాతీయ ఎస్సీ కమిషన్ వారు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి పెట్టాలనే ఉద్దేశంలో భాగమే పార్లమెంటు వేదికగా అమిత్‌షా వ్యాఖ్యలు చేశారన్నారు. భారతదేశ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుతున్నది అంబేడ్కర్ వల్లే అనే వాస్తవాన్ని మర్చిపోకూడదన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు బగాది వాసుదేవరావు అధ్యక్షతన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నంబూరు షణ్ముఖరావు, కేవీపీఎస్ నాయకులు




బి.ప్రభాకర్, డీటీఎఫ్ నాయకులు కోత ధర్మారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి యల్లయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె.కామేశ్వర రావు, ఏఐటీయూసీ నాయకులు అనపాన షణ్ముఖరావు, తెలుగుదేశం ఎస్సీ సెల్ నేత మట్ట పురుషోత్తం, బెల్లాన దాలయ్య, జొన్న సంజీవరావు, కామయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



**శ్రీకాకుళం, డిసెంబర్ 19(వార్త):** జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం వినియోగదారు న్యాయ పాలనకు వర్చువల్ విచారణ, డిజిటల్ సౌలభ్యం అనే అంశంపై జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నుంచి సుమారు 6 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను ఇంగ్లీష్, తెలుగు భాషల్లో నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.3000లు, ద్వితీయ బహుమతిగా రూ.2000లు, తృతీయ బహుమతిగా రూ.1500లు, ప్రశంసాపత్రాన్ని జిల్లాస్థాయిలో నిర్వహించే వినియోగదారుల దినోత్సవంలో అందజేయనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ చక్కటి ప్రతిభను ప్రదర్శించారని కొనియాడారు. కామర్స్ విభాగ హెచ్‌వోడీ ఎల్.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఎంతో చక్కగా తమ ప్రతిభా పాటవాలను పోటీ పరీక్షలలో చూపించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్ నారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ డి.ప్రభాకరరావు, శ్రీరామ్మూర్తిబాబు పాల్గొన్నారు.

# గంజాయి.. మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా

**వంగర, డిసెంబర్ 19(వార్త):** జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాలు, సైబర్ క్రైమ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన వంగర పోలీసుస్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు. డిజిటల్ కేసులపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లాలో ఐదు నెలల్లో 200 గంజాయి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఒడిశా నుంచి గంజాయి రవాణా అరికట్టడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే పీడీ చట్టం ప్రయోగిస్తామని



హెచ్చరించారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెట్టించినట్లు వివరించారు. మహిళా సంరక్షణ పోలీసులు, పోలీసు సిబ్బందితో మమేకమై, వారికి దత్తతగా అప్పగించిన గ్రామాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, భూతగదాలు, గొడవలు, పాత నేరస్తులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల పేర్లు, గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగంపై సమాచారం సేకరించి, ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, ప్రాపర్టీరూం, లాకప్ సెల్స్, సీజ్డ్ వాహనాలను పరిశీలించారు. పోలీసు స్టేషను రికార్డులు, సీడీ ఫైల్స్ తనిఖీ చేశారు.

ఆయన వెంట రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, ఎస్ఐ షేక్‌శంకర్, ఇతర పోలీసు అధికారులు, ఎంఎస్‌పీలు, దత్తత పోలీసులు ఉన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# నేడు విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్



**శ్రీకాకుళం, డిసెంబర్ 19(వార్త):** విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్.. స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు వివిధ శాఖల అధికారులు వినతులు స్వీకరిస్తారన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

# తీర ప్రాంత పరిరక్షణకు పటిష్ట చర్యలు

**-మత్స్యకారులకు అవగాహన కల్పించాలి**
**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్**



**శ్రీకాకుళం, డిసెంబర్ 19(వార్త):** తీరప్రాంత పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడతామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అన్నారు. జిల్లా స్థాయి తీర ప్రాంత భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన అంశాలపై తొలుత సమీక్షించారు. కోస్టల్ పోలీస్‌స్టేషన్స్ ప్రహరీ పనులను పంచాయతీరాజ్ శాఖ చేపట్టాలని ఆదేశించారు. సముద్ర తీరంలో ప్రమాదాలు జరిగే ప్రదేశాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటుచేయాలని ఎస్పీకి సూచించారు. వాచ్‌టవర్స్ ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. తీర ప్రాంతాల్లో హోర్డింగ్స్, బారువ, కళింగపట్నం ప్రాంతాల్లో లైఫ్ జాకెట్స్, బోట్స్ అవసరమని సభ్యులు కోరగా కలెక్టర్ తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులను ఆదేశించారు. సముద్ర వేటకు వెళ్లే మత్స్యకారులు మత్స్యశాఖ జారీ చేసే బయోమెట్రిక్ కార్డులు, ఆధార్ కార్డులు తీసుకెళ్లడం లేదని తెలియజేయగా, మత్స్యకారులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సముద్ర తీరంలో జెట్టీలను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరగా సంబంధిత పనులపై చర్యలు చేపట్టాలని మత్స్య శాఖ ఉప సంచాలకులను కలెక్టర్ ఆదేశించారు. తీర ప్రాంతంలో ఇంటర్నెట్ సౌకర్యం లేదని సభ్యులు కోరగా, చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సమావేశంలో కోస్టల్ గార్డ్ ఎస్పీ రవివర్మ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ పి.రాము, మత్స్యశాఖ ఉప సంచాలకులు పీవీ శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు టి.సంతోష్‌కుమార్, తీర ప్రాంత సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డు కుటుంబానికి బీమా చెక్కు అందజేత



**శ్రీకాకుళం, డిసెంబర్ 19(వార్త):** విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ మరణించిన హోంగార్డు కాంతారావు కుటుంబానికి బీమా మొత్తాన్ని గురువారం అందించారు. యాక్సిస్ బ్యాంకు వారి ప్రమాద బీమా నగదు రూ.34 లక్షల చెక్కును జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి.. కాంతారావు సతీమణి లక్ష్మి, కుటుంబసభ్యులకు అందించారు.

ఈసందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ కాంతారావు కుటుంబానికి ఎల్లవేళలా జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బీమా మొత్తాన్ని కుటుంబ అవసరాలు, పిల్లల చదువు నిమిత్తం సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. తక్కువ కాలంలోనే బీమా నగదు వచ్చేటట్లు చర్యలు తీసుకున్న బ్యాంకు అధికారులను అభినందించారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కేవీ రమణ, కార్యాలయ ఏవో సీహెచ్ గోపీనాథ్, యాక్సిస్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ రమేష్, డిప్యూటీ మేనేజర్ ఎస్.బాలరాజు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల వారోత్సవాలను జయప్రదం చేయండి

**-జిల్లా వినియోగదారుల క్లబ్బుల మాస్టర్ ట్రైనర్ ఎల్వీ చలం**

**పలాస, డిసెంబర్ 19(వార్త):** వినియోగదారుల వారోత్సవాలను జయప్రదం చేయాలని మాస్టర్ ట్రైనర్ ఎల్వీ చలం కోరారు. ఈనెల 24 వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయన్నారు. డీఈవో తిరుమల చైతన్య ఆదేశాల మేరకు పాఠశాల స్థాయిలో వినియోగదారుల రక్షణ చట్టం2019, డిజిటల్ లావాదేవీలు, ఆహార కల్తీ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు. జిల్లా స్థాయిలో 'వినియోగదారుల న్యాయ పాలనకు వర్చువల్ హీరింగ్, డిజిటల్ సౌకర్యం' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జిల్లాస్థాయిలో శ్రీకాకుళంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలనందు ఈ నెల 20న నిర్వహిస్తామన్నారు. విద్యార్థి స్థాయి నుంచే చైతన్యంగా మెలిగినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. ఓ సర్వే ప్రకారం 70 శాతం మంది డిజిటల్ లావాదేవీలు చేస్తున్నారని, అయితే ఈ సందర్భంగా జరుగుతున్న మోసాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం వినియోగదారుడికి నష్టం వాటిలినప్పుడు జిల్లా కమిషన్, రాష్ట్ర కమిషన్, జాతీయ కమిషన్‌ను ఆశ్రయించి పరిహారం పొందవచ్చన్నారు. వినియోగదారుల హెల్ప్‌లైన్ నెంబర్, సైబర్ ఫ్రాడ్ జరిగేటప్పుడు సంప్రదించాల్సిన నెంబర్లు తెలుసుకోవాలన్నారు. వినియోగదారుడు చైతన్యవంతమైనప్పుడే ఈ మోసాలను అరికట్టగలరని ఆయన స్పష్టం చేశారు.



# రైతులూ.. వరి కోతలు చేయొద్దు

**-పలాస డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ మధు**



**వజ్రపుకొత్తూరు, డిసెంబర్ 19 (వార్త):** బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, రైతులు ఎవరూ వరి కోతలు చేయవద్దని పలాస డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీ ఎల్వీ మధు అన్నారు. గురువారం ఆయన బెండి, పెద్ద బొడ్డపాడు గ్రామాల్లోని పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావానికి లోనుకాకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పలాస డివిజన్ పరిధిలో సుమారు 2000 ఎకరాల వరకు వరి పంట కోయాల్సి ఉందని, వజ్రపుకొత్తూరు మండలంలో 700 ఎకరాల వరకు వరి పంట కోతకు రైతులు సిద్ధంగా ఉన్నారన్నారు. వీరు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట వజ్రపుకొత్తూరు వ్యవసాయ అధికారిణి కిరణ్‌వాణి, డిప్యూటీ తహసీల్దార్ మురళి, వ్యవసాయ సిబ్బంది శివ, రైతులు ఉన్నారు.



## అర్హులందరికీ ఇళ్ల మంజూరు

**వజ్రపుకొత్తూరు, డిసెంబర్19(వార్త):** అర్హులైన నిరుపేదలందరికీ పార్టీలకతీతంగా పారదర్శంగా ఇళ్ల మంజూరు చేస్తామని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ అన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు గురువారం వారు పూండి, గోవిందపురం పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సర్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు గూడు కల్పించాలని కూటమి ప్రభుత్వం వడివడిగా చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో గొర్లె గణేష్, టీడీపీ సీనియర్ నాయకులు లావేటి శంకరరావు, పాలిన చంద్రయ్య, పుచ్చ అప్పలస్వామి, సచివాలయం సర్వే అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదు




**ఇచ్ఛాపురం, డిసెంబర్19(వార్త):** కొఠారి గ్రామంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్‌వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో ఏపీ శాక్స్ సహకారంతో గురువారం ఎయిడ్స్ నియంత్రణపై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ సూపర్‌వైజర్ సుధాకర్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ పద్ధతులను వివరించారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులపై వివక్షత చూపరాదన్నారు. సర్పంచ్ దుక్క ధనలక్ష్మి మాట్లాడుతూ సీఎఫ్‌ఐఎల్డీబ్ల్యూఎస్ సేవలు అమోఘం అన్నారు. సహదేవ్ రెడ్డి మాట్లాడుతూ పౌష్టికాహారం, రక్తహీనత గురించి వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో చిరంజీవి, వెంకటేశ్వరరావు, క్లస్టర్ లింక్‌వర్కర్ జి.రవి, సచివాలయం సిబ్బంది, మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణలు తొలగిస్తాం



**పలాస, డిసెంబర్ 19(వార్త):** ప్రభుత్వ భూములు, శ్మశాన స్థలాలు ఆక్రమణకు గురైతే వాటిని తొలగిస్తామని పలాస తహసీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. లొద్దభద్ర, కొత్త పారసాంబ, సొగిడియా ప్రాంతాల్లో గురువారం ఆయన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస మండలం జగన్నాథపురం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 57లో 2, 52లో 7 శ్మశాన స్థలాలు ఆక్రమణకు గురికాగా, గ్రామస్తుల సమక్షంలో వాటిని తొలగించామన్నారు. సదస్సులో 48 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వాయిలపల్లి సునంద, మండల సర్వేర్ గిరి, ఆర్ఐ కంచరాన ఖగేశ్వరరావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సచివాలయాల సంఘ అధ్యక్షుడిగా రవి



**శ్రీకాకుళం, డిసెంబర్ 19(వార్త):** శ్రీకాకుళం జిల్లా డెమొక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ వార్డ్ సచివాలయం అధ్యక్షుడిగా సారవకోట మండలం కుమ్మరిగుంట గ్రామ సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ రవికుమార్ సాహు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బి.రామ్మోహన్‌రావు, కోశాధికారిగా పి.వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా రోహిత్, ఫరూక్, బి.మోహన్, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణరావు, ఈసీ మెంబర్స్‌గా రామ్మోహన్ రావు, కల్యాణి, నవీన్‌ను ఎన్నుకున్నారు. వీరిని డెమోక్రటిక్ అసోసియేషన్ అఫ్ ఏపీ గ్రామ వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుగుబెల్లి కిరణ్‌కు మార్ అభినందించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పార్టీ ఏ బాధ్యతలు ఇచ్చినా చేస్తా : అనపాన



**మెళియాపుట్టి, డిసెంబర్19(వార్త) :** పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యే ఎంజీఆర్ తనకు ఏ బాధ్యతలు అప్పగించినా వాటిని పూర్తి చేస్తానని మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షులు అనపాన రాజశేఖరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మెళియాపుట్టిలో నీటిసంఘం అధ్యక్షురాలు అనపాన రాజరత్నం ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దుక్క శంకర్ రెడ్డి, కోట నందేస్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# టెక్కలి పెట్రోల్ బంకులో మంటలు



**టెక్కలి, డిసెంబర్ 19(వార్త):** టెక్కలి పాత జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంకులో గురువారం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పెట్రోల్ బంకులోని ఆయిల్ కొట్టే యంత్రం నుంచి మంటలు వ్యాపించడంతో సిబ్బంది పరుగులు తీశారు. మంటలు అధికం అవుతుండడంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు భయపడ్డారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి టెక్కలి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు చేరుకుని మంటలు అదుపు చేశారు. మంటలు వ్యాపించడానికి గల కారణాలపై అధికారులు పరిశీలన చేస్తున్నారు. అయితే పెట్రోల్ బంకులో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో సమీప నివాసగృహాలు, దుకాణాల్లో ఉన్న వారు ఉలిక్కిపడ్డారు. మంటలు అదుపులోకి రావడంతో పెను ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. టెక్కలి బంక్ ప్రమాద ఘటనపై టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ఆరా తీశారు. సంఘటనా స్థలానికి చేరుకొని ఆయన పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులకు విచారణ చేపట్టాలని ఆర్డీవో ఆదేశించారు.



# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



**వజ్రపుకొత్తూరు, డిసెంబర్ 19 (వార్త):** మహిళలు అన్ని రంగాలతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారని ఎంపీడీవో రమేష్‌నాయుడు అన్నారు. గురువారం ఆయన వజ్రపుకొత్తూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్‌పై రైతు ఉత్పత్తిదారుల సంఘాల మహిళా కిసాన్ సభ్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేష్‌నాయుడు మాట్లాడుతూ మండలంలో కొమరల్తాడ గ్రామాన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘంగా గుర్తించామన్నారు. ఈ గ్రామంలో 300 కుటుంబాలు ఉన్నాయని, వారికి జీవనోపాధి కల్పించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మహిళలు రకరకాల కూరగాయలు పండించడానికి అవకాశాలు అక్కడ ఉన్నాయని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. రైతులు కోళ్లు, గొర్రెలు, మేకలు, పశువుల పెంపకంతో అదనపు ఆదాయము వస్తుందని, ప్రతినెల ప్రతి కుటుంబానికి 10,000 నుంచి 15 వేల రూపాయల ఆదాయం కల్పించడమే ఈఐఎఫ్‌సీ లక్ష్యమని చెప్పారు. దీనిపై మహిళలకు అవగాహన కల్పించామని తెలిపారు. మహిళలకు బ్యాంకు రుణాలు కూడా మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం నారాయణరావు, సోంపేట ఏరియా కోఆర్డినేటర్ సీహెచ్ రామ్మోహనరావు, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం ధనుంజయ, ఏపీఎం గొడబ ప్రసాదరావు, ఎఫ్‌పీవో ఏపీఎం ఈశ్వర్, ఏవో కిరణ్ వాణి, మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ కొండ నాగరాజు, పశువైద్యాధికారి మెట్ట పాపారావు, ఉద్యాన శాఖ అధికారులు, ఎఫ్‌పీవో అధ్యక్షుడు కేశవరావు, బీవోడీ సభ్యులు, సభ్యులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



## అంబేడ్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు సరికాదు

**పలాస, డిసెంబర్ 19(వార్త):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్ సభలో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సరికాదని పలాస కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన పీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెంబూరి మధుసూదనరావు ఆధ్వర్యంలో కాశీబుగ్గ బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడంతో దళిత, గిరిజన, మైనారిటీ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ విధానాలకు బానిసగా ఉంటూ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం బీజేపీ నేతలు చేస్తున్నారని ఆరోపించారు. అమిత్‌షా వెంటనే పదవికి రాజీనామా చేసి, ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తంగుడు వీర్రాజు, రమేష్ సాహు, తంగుడు సత్యం, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనుల పరిశీలన



**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 19 (వార్త):** శ్రీకాకుళం నగరం కార్పొరేషన్ పరిధిలోనిప్రభుత్వ ఉమెన్స్ కాలేజీ రోడ్డు పనులను శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ గురువారం రాత్రి అనుచరులతో కలిసి పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. వర్షం వల్ల కొద్దిగా ఇబ్బందులు వచ్చాయని, రోడ్డు పనుల్లో నాణ్యత పాటిస్తున్నామని కాంట్రాక్టర్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు ఈ రోడ్డు పనులను పరిశీలిస్తున్నామని మాదారపు వెంకటేష్ తెలిపారు.



# సచివాలయాల్లో ... మౌలిక వసతులేవీ?

### దరఖాస్తులు లభించని వైనం- ప్రజలకు తప్పని ఇక్కట్లు
### -నిర్వహణ ఖర్చులు ఇవ్వని ప్రభుత్వం



**పలాస, డిసెంబర్ 19 (వార్త):**

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ, మండలాల్లో గత ప్రభు త్వం స్థాపించిన గ్రామ, వార్డు సచివాలయాలు మౌళిక సదు పాయాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. నిర్వహణ భార మంతా ప్రజలపై నెట్టేస్తూ.. సిబ్బంది కుర్చీలకే పరిమితం అవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అర్హులైన వారు ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే దర ఖాస్తులు లేని దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. దరఖాస్తులు లేవంటూ..సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్ కు వెళ్లి దరఖాస్తు నమూనా ఫారాలు తెచ్చుకోవాలని సూచిస్తు న్నారు. జనన, మరణ సర్టిఫికెట్ లే కాకుండా ప్రతి సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే జిరాక్స్ సెంటర్‌కు వెళ్లి అప్లికేషన్ ఫారాలు తెచ్చుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సచివాలయాల్లో ప్రతి సర్టిఫికెట్‌కు యూజర్ చార్జీల రూపంలో రూ.50 తీసుకున్నప్పటికీ అందుకు తగిన న్యాయం చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మూలకు చేరిన కంప్యూటర్లు**

బర్త్ సర్టిఫికెట్ల నుంచి ల్యాండ్ సర్టిఫికెట్ల వరకు సచివా లయాల ద్వారా దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించిన ప్రభుత్వం సచివాలయాల నిర్వహణకు గత మూడున్నర ఏళ్ల నుంచి పైసా కూడా మంజూరు చేయకపోవడంతో సచివాలయంలో ఉన్న కంప్యూటర్లు ప్రింటర్లు మరమ్మతులు గురై మూలకు చేరాయి. స్టేషనరీ సామగ్రి లేక ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. సచివాలయ ఉద్యోగులకు జీతాలు ఇచ్చి పెంచి పోషిస్తున్న ప్రభుత్వం నిర్వహణకు నిధులు మంజూరు చేయకుండా తాత్సారం చేయడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్టేషనరీ కోసం నిధులు మంజూరు చేయాల్సిన మండల పరిషత్ డెవలప్ మెంట్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్ తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా అయితే సచివాలయ వ్యవస్థ పెట్టి ఏం లాభం మని పలువురు పెదవి విరుస్తున్నారు. పలాస అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ని పచివాలయాల్లో కంప్యూటర్లో ప్రింటర్లు మరమ్మత్తులు గురైనప్పటికీ బాగుచేసే నాథుడే లేరని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి పేర్కొన్నారు.

**ప్రజలకు చుక్కలు**

ముఖ్యంగా పలాసలో బత్తుల వీధి సచివాలయం, సూది కొండ సచివాలయం, కాశీబుగ్గ సంత మైదానంలోని సచివా లయం, పూజారి వీధి, పెద్ద బ్రాహ్మణ వీధిలోని సచివాల యాలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. తాము పబ్లిక్ సర్వెంట్లమని మరచి ప్రజలపై అనుచితంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. సచివాలయాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో సచివా లయ వ్యవస్థలో నిర్లక్ష్యం ఆవహించింది. సచివాలయాల వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ లైట్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాలను సరిగా మెయింటైన్ చేయకపోవడంతో సకాలంలో సరైన సదుపాయాలు అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సచివాలయాల్లో మౌలిక సదుపా యాల కల్పనకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## శ్రీకాకుళం

### కూర్మనాథుని సన్నిధిలో మైరెన్ ఎస్పీ

**గార, డిసెంబర్ 19 (వార్త):** శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని తీర ప్రాంత రక్షణ దళం (మైరెన్) ఎస్పీ రవివర్మ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు క్షేత్ర మహాత్యాన్ని వివరించారు. ఈవో జి.గురునాథరావు స్వామి చిత్రపటాన్ని, క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు. అంతకుముందు కళింగపట్నం మైరెన్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తీరంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల వద్ద పర్యవేక్షించాలని సూచించారు. ఆయనతో పాటు కళింగపట్నం మైరెన్ స్టేషన్ సీఐ బూర ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనాలి

**నరసన్నపేట/పోలాకి, డిసెంబర్ 19 (వార్త):** మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఈ నెల 21న ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. శని వారం మండల కేంద్రాలు, నియోజక వర్గ కేంద్రాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పార్టీ సమన్వయకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులతో పాటు ఇతర పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ సభ్యు లు, నాయ కులు అందరూ పాల్గొనాలని సూచించారు. అన్ని చోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పార్టీ నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాల న్నారు. నరసన్నపేటలో శనివారం ఆస్పత్రిలో పండ్లు పంపిణీతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పార్టీ ప్రధాన నాయకులు అం దరూ ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలన్నారు.

### శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

**పాతపట్నం, డిసెంబర్ 19 (వార్త):** విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎన్.బాలాజీ అన్నారు. పాతపట్నం బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కూడా లక్ష్యాన్ని పెట్టుకుని చదువు కోవాలన్నారు. విద్యార్థుల వంట గది, మరుగుదొడ్లను పరిశీలించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థినుల భోజనం, కూరను పరిశీలించారు. పదో తరగతి, ఇంట ర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అర్చన, కొల్లివలస ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


### టెన్త్ మోడల్ పేపర్ల ఆవిష్కరణ

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 19 (వార్త):** పదో తరగతి ఇంగ్లిష్ మీడియం మోడల్ పేపర్స్‌ను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆవిష్కరించారు. మంచి మార్కుల స్కోరింగ్‌కు ఉపయోగపడే ఈ పుస్తకాన్ని విద్యార్థులకు సరసమైన ధరలకు అందించడం మంచి పరిణామమని జాయింట్ కలెక్టర్ అన్నారు. యూటీఎఫ్ సంస్థ ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు విద్యార్థుల సంక్షేమాన్ని కూడా చూడడం చాలా ఆనందించదగ్గ విషయమని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి హెచ్ అన్నాజీరావు, అకడమిక్ కమిటీ కన్వీనర్ ఎల్‌వీ చలం, కోదండ రామయ్య పాల్గొన్నారు.

### ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**హిరమండలం, డిసెంబరు19(వార్త):** ఎల్ఎన్‌పేట మండ లం ముంగెన్నపాడు గ్రామ సమీపంలో అలికాం-బత్తిలి ప్రధాన రహ దారిపై ఆర్టీసీ బస్సు ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. శ్రీకాకుళం డిపో-2కు చెందిన కొత్తూరు-శ్రీకాకుళం ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ కొత్తూరు నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తుండగా ఎల్ఎన్‌పేట మండలం ముంగెన్నపాడు గ్రామ సమీపంలో ఇసుక ట్రాక్టర్‌ను అధిగమించే క్రమంలో వెనుకనుంచి ఢీకొన డంతో ట్రాక్టర్ తొట్టె బోల్తా పడింది. బస్సులో సుమారు 30 మందికి పైగా ప్రయాణికులున్నట్లు సమాచారం. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

### సాగునీటి కాలువల నిర్మాణాలకు నిధులు




**ఆమదాలవలస, డిసెంబరు 19 (వార్త):** నియోజకవర్గ పరిధిలో సాగునీటి కాలువలు పనుల చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదల చేశారు. సాగునీటి కాలు వల్లో గుర్రపు డెక్క, తూటి కాడ తొలగింపునకు 20 పనులకు గాను రూ.17.93 లక్షలు రెగ్యులేటర్లు మం˘మ్మతు, కాలువ గట్లు గండ్లు పూడ్చటం లాంటి అత్యవసర పనులకు కోసం 17 పనులకు గాను రూ. 58.40 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సాగునీటి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం విధుల మంజూరు చేయడంతో ఇరిగేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయన్నుట్లు వెల్లడించారు. సాగునీటి కాలువల ద్వారా ఆయకట్టు ప్రాంతాలకు సాగునీరు సకాలంలో అందించేందుకు ఈ నిధులు ఎంతో ఉపయోగ పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



- ✳ జంట పట్టణాల్లో ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు
- ✳ కాసులకు కక్కుర్తి పడి నిబంధనలు పాటించని అధికారులు
- ✳ నిర్మాణాల్లోనూ నాణ్యత లోపం కాలువలు, రోడ్లు సైతం కబ్జా
- ✳ భవన నిర్మాణదారులతో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కొందరు కుమ్మక్కు
- ✳ మామూళ్లు మత్తులో అధికారులు
- ✳ నిబంధనలు అతిక్రమించి బహుళ నిర్మాణాలు
- ✳ మున్సిపల్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు
- ✳ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన కూటమి నేతలు

# అనుమతులు మూడు.. కట్టేది ఐదు.!

**పలాస, డిసెంబర్ 19 (వార్త):** పలాస పురపాలక సంఘం పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా భారీ భవంతులు, అక్రమ కట్టడాలు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు, పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రహదారులు, కాలువలను కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. మరికొందరు ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్థుల నిర్మాణం చేపడుతూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. చేతివాటంకు అలవాటుపడ్డ అధికారులు జేబులు నింపుకోవడమే తప్ప అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా భారీ భవనాల నిర్మాణాలు చేపడుతున్నప్పటికి సంబంధించిన అధికారులు మాత్రం నిద్రమత్తులో తూలుతున్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గాంధీనగర్‌లో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు కార్యాలయం సమీపంలో ఐదుగురికి అంతస్తుల భవనానికి రెండు, మూడు స్లాబ్‌లకు అనుమతులు తీసుకొని, ఏకంగా ఐదు అంతస్థుల భవనాన్ని నిర్మాణం చేపడుతున్నారు. చిన్నపాటి రహదారి కలిగి ఉన్న వీధిలో భారీ భవనం ఎటువంటి ప్రమాదం తెచ్చి పెడుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ భవనంలో కదలికలు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే నిర్మాణదారుడు సాఫీగా ఉంటాడని, చుట్టుపక్కల ఉన్న



ఇల్లు నేలమట్టం అయి, జరిగే ప్రాణనష్టం ఊహించుకుంటుంటునే భయమేస్తుందని అక్కడ ప్రజలు వాపోతున్నారు. ఆ భవనం నిర్మాణానికి అతని స్థలం సరిపోకపోవడంతో మున్సిపాలిటీ కాలువ సైతం ఆక్రమణ చేశారని విమర్శలు ఉన్నాయి. ఈ విధంగానే సాయికాలనీలో నిబంధనలకు విరుద్ధంగా ఐదు అంతస్తులతో ఒక భవపం, న్యూ కాలనీలో బహుళ అంతస్తులతో మరో భవనం, మహారాణి పేటలో ఒక భవనం, పద్మనాభపురం కాలనీ వద్ద ఒక భవనం, ఇలా చెప్పుకుంటూ పోతే మున్సిపాలిటీ పరిధిలోని పలుచోట్ల నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా బహుళ అంతస్థుల భవనాలను యాజమానులు ఎవరికి తోచిన విధంగా వారు నిర్మించుకు పోతున్నారు. కొందరు కేటీ రోడ్డుతో పాటు, పలు వీధుల్లో మురికి కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలు సాఫీగా సాగిపోతున్న పట్టించుకోడే నాధుడు కరువయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి విమర్శలు వినిపిస్తున్నాయి.

### టౌన్ ప్లానింగ్ ఉందా.. లేదా?

మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా పలు బహుళ అంతస్తుల నిర్మాణాలు ఎక్కడపడితే అక్కడ నిర్మాణాలు జరుగుతున్న చేతివాటానికి అలవాటు పడ్డ కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు వాటిని పట్టించుకునే పరిస్థితి లేరన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలపై కొన్ని పత్రికలలో కథనాలు వచ్చినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం ఆ భవనాల పరిస్థితి పరిశీలన చేసేందుకైనా రాలేదని, యాజమానులకు ఎటువంటి హెచ్చరికలు చేసిన దాఖలాలు కూడా లేవని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు స్పందించి అక్రమ భవన నిర్మాణాలను, ప్రారంభ దశలోనే అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### ఎమ్మెల్యే దృష్టికి పలు ఫిర్యాదులు..

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై, అదే విధముగా ఆక్రమణలపై కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీజేపీ, జనసేన నాయకులు ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని బీజేపీ, జనసేనకు చెందిన నేతలు కొందరు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల తొలగిస్తామని ఎమ్మెల్యే పదే పదే చెబుతున్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు జరగడంలేదు. ఇకనైనా ఎమ్మెల్యే తక్షణమే స్పందించి అక్రమ భవన నిర్మాణాలు, ఆక్రమణలు తొలగించేలా చూస్తారో.. మౌనం వహిస్తారో వేచిచూడాల్సివుంది.

Printed and published and Owner by Shaik Sahid, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546